అంకారపు మల్లేశం (ఫైల్)

అడిశర్ల సాయి (ఫైల్)

ఇంటి ముందు రోదిస్తున్న సాయి తల్లిదండ్రులు కైలాసం, పద్మ, అన్న మహేందర్

రాజు భార్య రేఖ, కొడుకు దేవీప్రసాద్ (ఇన్‌సెట్‌లో) రాజు(ఫైల్)

ముగ్గురు నేతన్నలు బలి

- 24 గంటల్లో ఉరికొయ్యకు వేలాడిన కార్మికులు
- సిరిసిల్లలో మరణమృదంగం
- ఆర్థిక ఇబ్బందులతో మనస్తాపం
- కార్ఖానా సమీపంలోనే చెట్టుకు ఉరేసుకుని ఒకరు..
- ఇంట్లోనే ఉరేసుకుని మరొకరు..
- ఆకలి చావుతో ఇంకొకరు..
- బాధిత కుటుంబాలకు బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ పరామర్శ

సిరిసిల్ల జిల్లా తంగళ్లపల్లిలోని ఇందిరానగర్‌లో నేతకార్మికుడు అంకారపు మల్లేశం కుటుంబాన్ని పరామర్శిస్తున్న బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్

రాజన్న సిరిసిల్ల, ఏప్రిల్ 25 (నమస్తేతెలంగాణ) / సిరిసిల్ల రూరల్ : కార్మిక క్షేత్రం సిరిసిల్లలో నేతన్నల ఆత్మహత్యల పరంపర మళ్లీ మొదలైంది. 24 గంటల్లోనే ముగ్గురు నేత కార్మికులు ప్రాణాలు వదిలారు. ఇందులో ఇద్దరు ఉరివేసుకొని బలవన్మరణం చెందగా.. మరొకరు ఉపాధి దొరక్క.. ఆకలితో అలమటించి ఊపిరి విడిచారు. కేసీఆర్ పాలనలో చేతినిండా పనితో ధీమాగా బతికిన కార్మిక లోకం, కాంగ్రెస్ నాలుగు నెలల పాలనలో ఉపాధి లేక ఆగమవుతున్నది. వస్త్ర పరిశ్రమలో ఏర్పడిన సంక్షోభంతో కార్ఖానాలు మూతపడి పనులు లేక, ఆర్థిక ఇబ్బందులతో నేతకార్మికులు ఆత్మహత్యల బాటపడుతున్నారు. సిరిసిల్ల పర్యటనలోనే ఉన్న బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, ఎమ్మెల్యే కేటీఆర్ బాధిత కుటుంబాలను పరామర్శించారు.

రాజన్న సిరిసిల్ల జిల్లా తంగళ్లపల్లి మండల కేంద్రంలోని ఇందిరానగర్‌కు చెందిన అంకారపు మల్లేశం(55)కు భార్య భారతి, కొడుకు మహేందర్, కూతురు మనీషా ఉన్నారు. భార్య బీడీలు చుడుతుండగా, ఆయన మరమగ్గాలు నడుపుతుంటారు. రెండేండ్ల క్రితం కూతురి పెండ్లి చేశాడు. నాలుగు నెలల క్రితం భార్యకు కాలు విరగడంతో చికిత్స కోసం ఖర్చు చేయడంతో ఆర్థికంగా ఇబ్బందులు మొదలయ్యాయి. కాంగ్రెస్ సర్కార్ వస్త్ర పరిశ్రమకు బకాయిలు చెల్లించక పోవడంతో పాటు కొత్త ఆర్డర్లు ఇవ్వకపోవడంతో మరమగ్గాలు మూతపడ్డాయి. దీంతో నేత కార్మికులకు నాలుగు నెలలుగా పనిలేకుండా పోయింది. కుటుంబాలను పోషించుకోలేక, అప్పులు కట్టలేక మనోవేదనకు గురైన మల్లేశం గురువారం ఉదయం కార్ఖానా సమీపంలోనే చింత చెట్టుకు నైలాన్ తాడుతో ఉరేసుకొని ప్రాణాలు తీసుకున్నారు. ఆయన భార్య భారతి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్టు పోలీసులు తెలిపారు.

ఉపాధి లేక ప్రాణం తీసుకున్న కార్మికుడు

సిరిసిల్ల పట్టణంలోని పద్మనగర్‌కు చెందిన అడిశర్ల కైలాసంకు భార్య పద్మ, ఇద్దరు కొడుకులు మహేందర్, సాయి, కూతురు మౌనిక ఉన్నారు. కూతురి పెండ్లి చేశారు. కైలాసంకు పదేండ్ల క్రితమే పక్షవాతం వచ్చి కాలు చెయ్యి పడిపోయింది. వైద్యఖర్చుల కోసం రూ.పది లక్షలు అప్పు అయ్యింది. చిన్నపాటి పెంకుటిల్లు కూలిపోవడంతో ఓ ఇంట్లో అద్దెకు ఉంటున్నారు. పెద్దకొడుకు మహేందర్ మెడికల్ ఏజెన్సీలో గుమస్తాగా పనిచేస్తున్నారు. చిన్న కొడుకు అడిశర్ల సాయి (26) సిరిసిల్ల పట్టణంలోని ఓ వస్త్ర యజమాని వద్ద మరమగ్గాలకు బీములు పోసే (వార్పిన్) పనిచేస్తున్నారు. ప్రభుత్వం మారిన తర్వాత వస్త్రపరిశ్రమలో సంక్షోభంలో పడింది. వార్పిన్లు కూడా బంద్‌కావడంతో సాయి ఉపాధి కోల్పోయారు. ఇంటి వద్దే ఉండి తండ్రిని చూసుకుంటున్నారు. నాలుగు నెలలుగా పనిలేకపోవడంతో మానసికంగా కుంగిపోయారు. ఇంటి అద్దె చెల్లించలేక, కుటుంబాన్ని పోషించలేక మనస్తాపం చెందారు. గురువారం సాయంత్రం సాయి ఇంట్లోనే చీరతో ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నారు. తల్లిదండ్రుల ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు.

సిరిసిల్ల నేతన్న ఆకలి చావు

సిరిసిల్లలోని నెహ్రూనగర్‌కు చెందిన ఈగ రాజు(50) ఆకలితో అలమటించి ప్రాణాలు కోల్పోయారు. ఈయనకు భార్య రేఖ, కొడుకు దేవీప్రసాద్, కూతురు లక్ష్మీప్రసన్న ఉన్నారు. రాజు తన ఇంట్లో మూడు జోడీల సాంచాలు పెట్టుకున్నారు. ఆర్థిక స్థోమత లేక వాటిని నడిపించలేక సాంచాలను ఏడాది కింద అమ్ముకున్నారు. అక్కడ ఇక్కడా సాంచాలు నడుపు కొంటూ కుటుంబాన్ని పోషిస్తూనే కూతురు, కుమారుడిని చదివిస్తున్నారు. కేసీఆర్ ప్రభుత్వంలో బతుకమ్మ ఆర్డర్లు ఇచ్చి సిరిసిల్ల నేత కార్మికులకు చేతినిండా పనికల్పించడంతో నెలకు రూ.15 వేల వరకు వేతనం తెచ్చేవాడని అతని భార్య రేఖ తెలిపారు. ప్రభుత్వం మారిన తర్వాత ఆర్డర్లు లేక సాంచాలు బంద్ కావడంతో నాలుగు నెలలుగా ఖాళీగానే ఉంటున్నారు. ఏదోఒక పనిచేస్తానంటూ 15 రోజుల క్రితం చెప్పకుండానే ఇంట్లో నుంచి వెళ్లిపోయారు. వెళ్లిన రాజు ఫోన్ చేయకపోవడంతో ఆందోళనలో ఉన్న కుటుంబ సభ్యులకు రామడుగు మండలం వెదిర గ్రామ సమీపంలో బుధవారం శవమై దొరికాడు.మృతదేహం అప్పటికే బక్కచిక్కి, రంగుమారిపోయింది. ఉపాధివేటలో తిరిగి ఆకలితో అలమటించి చనిపోయాడని కుటుంబ సభ్యులు తెలిపారు.

భార్యాపిల్లలపై ఒట్టేస్తవా?

- రేవంత్‌రెడ్డీ.. అంత దమ్ముందా?
- రుణమాఫీపై దేవుళ్లపై ఒట్టేసుడు కాదు
- మీ పాలనలో ఉరితాళ్లకు నేతన్నలు
- మాపై కోపంతో నేతన్నలపై కక్ష
- 24 గంటల్లో ప్రభుత్వం స్పందించాలె
- లేదంటే నేతన్నల కోసం రోడ్డెక్కుతాం
- మోదీ 2 కోట్ల ఉద్యోగాలు ఎమాయె?
- బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్
- నేత కార్మికుల కుటుంబాలకు తక్షణ సహాయంగా 50 వేలు

రాజన్న సిరిసిల్ల జిల్లా కోనరావుపేటలో రోడ్ షోలో మాట్లాడుతున్న బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్, పక్కన కరీంనగర్ పార్లమెంట్ బీఆర్ఎస్ అభ్యర్థి వినోద్‌కుమార్

సిరిసిల్ల రూరల్/రాజన్న సిరిసిల్ల, ఏప్రిల్ 25 (నమస్తే తెలంగాణ): 'ఆగస్టు 15న రుణ మాఫీ చేస్తానని దేవుళ్ల మీద ఒట్టు పెట్టడం కాదు.రేవంత్‌రెడ్డికి నిజంగా దమ్ముంటే భార్యా పిల్లలపై ఒట్టు వేసి చెప్పాలి' అని సీఎంకు బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ సవాల్ విసిరారు. అధికారంలోకి రావాలన్న ఆశతో కాంగ్రెస్ అరచేతిలో వైకుంఠం చూపించిందని,మహిళలకు రూ.2,500,కల్యాణలక్ష్మి కింద తులం బంగారం, రూ.2 లక్షల రుణమాఫీ, రూ.4 వేల పెన్షన్ వంటి హామీలు ఏమయ్యాయని నిలదీశారు. వంద రోజుల్లోనే ఆరు గ్యారెంటీలు అమలు చేస్తామని చెప్పి, 150 రోజులు అవుతున్నా అంతా సున్నా అని ధ్వజమెత్తారు. గురువారం సిరిసిల్ల తెలంగాణభవన్‌లో ముస్తాబాద్, గంభీరావుపేట, తంగళ్లపల్లి మండలాల కార్యకర్తల సమావేశానికి కేటీఆర్ హాజరయ్యారు. లోక్‌సభ ఎన్నికలపై కార్యకర్తలకు దిశానిర్దేశం చేశారు. సాయంత్రం 7 గంటలకు కోనరావుపేటలో బీఆర్ఎస్ కరీంనగర్ అభ్యర్థి వినోద్‌కుమార్‌తో కలిసి రోడ్‌షోలో పాల్గొన్నారు. ఉపాధి లేక ఆత్మహత్య చేసుకున్న నేత కార్మికులు అడిశర్ల సాయి, అంకారపు మల్లేశం కుటుంబసభ్యులను పరామర్శించారు. వారి కుటుంబ పరిస్థితి తెలుసుకొని తక్షణ సాయంగా రూ.50 వేల చొప్పున అందజేశారు. రెండు రోజుల్లో మళ్లీ వస్తానని, నేతన్నలకు అండగా ఉంటామని భరోసా కల్పించారు.ఈ సందర్భంగా కేటీఆర్ మాట్లాడుతూ.. 'పాలిచ్చే బర్రెను అమ్ముకుని దున్నపోతును కొనుక్కున్నట్టు ఇప్పుడు తెలంగాణ ప్రజల పరిస్థితి ఉన్నది. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన నాలుగు నెలల్లోనే రైతులు, నేతన్నల ఆత్మహత్యలు మళ్లీ పునరావృతమయ్యాయి. రైతుబంధు ఇప్పటికీ పడలేదు. జనవరి ఆసరా పింఛన్లు ఎగ్గొట్టిండు. రాబోయే రోజుల్లో రైతుబంధు ఎగ్గొట్టడని గ్యారెంటీ ఏంటి? కాంగ్రెస్ ప్రభుత్వం ఆడబిడ్డల పెళ్లికి తులం బంగారం కాదు కదా.. తులం ఇనుము కూడా ఇవ్వదు' అని తెలిపారు.

నేతన్నల బతుకులు తలకిందులు

'సిరిసిల్లలో 2009లో శాసనసభ్యుడిగా ఎన్నికైన సందర్భంలో బాధాకరమైన పరిస్థితులు ఉండేవి. 2007లో కూడా వారంలో 8, 9 మంది నేతకార్మికులు వరుసగా ఆత్మహత్యలు చేసుకున్నరు. సిరిసిల్ల ఉరిసిల్లగా మారుతున్నదని చెప్పినా, కార్మికులు ఆర్తనాదాలు చేసినా అప్పటి కాంగ్రెస్ సర్కారు పట్టనట్టు వ్యవహరించింది.ఆనాడు కేసీఆరే పార్టీ నుంచి రూ.50లక్షలు పద్మశాలీలకు అందించి, సూక్ష్మరుణాలతో ఆదుకున్నారు' అని కేటీఆర్ గుర్తు చేశారు. స్వరాష్ట్రంలో అధికారంలోకి వచ్చిన తర్వాత ఒక్క నేతన్న చనిపోకుండా, వారికి ధైర్యాన్ని ఇచ్చి, బ్రహ్మాండమైన పాలసీలు చేనేత మిత్ర, నేతన్నకు చేయూత, బతుకమ్మ చీరల ఆర్డర్లు, చేనేత బంధు, చేనేత బీమా పథకాలను తీసుకొచ్చి ఉపాధి కల్పించామని చెప్పారు. 'ఇప్పుడు చాలా దురదృష్టం. రేవంత్‌రెడ్డి ప్రభుత్వం వచ్చిన తర్వాత నాలుగునెలల్లో ముగ్గురు ఆత్మహత్యలు చేసుకున్నరు. ఇవాళ ఒకే రోజు సిరిసిల్లలో యువ నేతకార్మికుడు అడిచర్ల సాయి, తంగళ్లపల్లిలో నేతకార్మికుడు అంకారపు మల్లేశం ఆత్మహత్య చేసుకోవడం బాధాకరం. ఇవి ముమ్మాటికీ ప్రభుత్వ హత్యలే' అని మండిపడ్డారు. బాగా నడుస్తున్న పరిశ్రమను కేవలం కేసీఆర్, కేటీఆర్ నియోజకవర్గం అన్న కోపంతో రేవంత్‌రెడ్డి వేధించటం దురదృష్టకరమని అన్నారు. ప్రభుత్వం మొద్దు నిద్ర నుంచి మేల్కొనాలని, పెండింగ్ బకాయిలు 24 గంటల్లో చెల్లించాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వం స్పందించక పోతే నేతన్నల కోసం తాము రోడ్డెక్కుతామని హెచ్చరించారు.

దేవుళ్ల పేరుతో బీజేపీ రాజకీయాలు

ప్రజలు మళ్లీ దొంగల మాటలు నమ్మి మోసపోవద్దని కేటీఆర్ సూచించారు. ప్రజల ఆదాయం రెట్టింపు చేస్తామంటూ ప్రగల్భాలు పలికిన మోదీ మాయలో పడొద్దని అన్నారు. రెండు కోట్ల ఉద్యోగాలు ఎటుపోయాయని బీజేపీని ప్రశ్నించారు. పదేండ్లలో మోదీ సర్కారు దేశ ప్రజలకు చేసిందేమీ లేదని, అందుకే దేవుళ్ల పేరుతో రాజకీయం చేస్తున్నారని విమర్శించారు. చేసిన అభివృద్ధి చెప్పుమంటే జైశ్రీరాం అంటారని తెలిపారు. కరీంనగర్ పార్లమెంట్ ప్రజలకు అమిత్‌షా చెప్పులు మోసేవాడు కాదు.. కరీంనగర్ ప్రజలకు అభివృద్ధి చేసే నాయకుడు కావాలని వెల్లడించారు. ప్రజా సమస్యలపై ప్రశ్నించే బోయినిపల్లి వినోద్‌కుమార్‌ను ఎంపీగా గెలిపించాలని విజ్ఞప్తి చేశారు. 12 ఎంపీ సీట్లు అప్పజెప్పితే ఏడాదిలో మళ్లీ కేసీఆర్ సర్కారు వస్తుందని అన్నారు. సిరిసిల్లలో నేతకార్మికుల వరుసగా ఆత్మహత్యలు చేసుకోవడానికి కారణం సీఎం రేవంత్‌రెడ్డే అని వినోద్‌కుమార్ ఆరోపించారు. కేసీఆర్ సర్కార్ హయాంలో ఒక్క ఆత్మహత్య జరగలేదని, ఇప్పుడు ఎందుకు చనిపోతున్నారని ప్రశ్నించారు. దీనికి సీఎం రేవంత్‌రెడ్డి జవాబు చెప్పాలని డిమాండ్ చేశారు. కార్యక్రమాల్లో టెస్కాబ్ చైర్మన్ కొండూరి రవీందర్‌రావు, వేములవాడ నియోజకవర్గ ఇన్‌చార్జి చల్మెడ లక్ష్మీనర్సింహారావు, జడ్పీ చైర్‌పర్సన్ న్యాలకొండ అరుణ, బీఆర్ఎస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు తోట ఆగయ్య, రాష్ట్ర నేత గూడూరి ప్రవీణ్, రాఘవరెడ్డి, గజభీంకార్ రాజన్న, పడిగెల రాజు, బొల్లి రామ్మోహన్, అంకారపు రవీందర్, బండి జగన్, అంకారపు అనిత, అబ్బాడి అనిల్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్‌లో అగ్రకుల రాజ్యం!

- 12 జనరల్ ఎంపీ సీట్లలో 9 ఓసీలకే
- రెడ్డి సామాజిక వర్గానికి 7 స్థానాలు
- మొక్కుబడిగా బీసీలకు మూడు సీట్లు
- బీఆర్ఎస్‌లో బీసీలకే అగ్రతాంబూలం
- 12 జనరల్ స్థానాల్లో 6 బీసీలకు
- రెడ్డి సామాజిక వర్గానికి 4 సీట్లు
- బీఆర్ఎస్‌లో సామాజిక న్యాయం

హైదరాబాద్, ఏప్రిల్ 25 (నమస్తే తెలంగాణ): పార్లమెంట్ అభ్యర్థుల నామినేషన్ల దాఖలుకు గురువారంతో గడువు ముగిసింది. ప్రధాన రాజకీయ పార్టీలు అభ్యర్థుల ఎంపికలో అనుసరించిన సామాజిక సమీకరణలపై స్పష్టత వచ్చింది. రాష్ట్రంలో మొత్తం 17 పార్లమెంట్ స్థానాలకుగాను 3 ఎస్సీలకు, 2 ఎస్టీలకు రిజర్వు చేయగా, మిగతావి (12) జనరల్ స్థానాలు.అధికార కాంగ్రెస్ పార్టీ 12 జనరల్ సీట్లలో 9 స్థానాలను అగ్రకులాలకు కట్టబెట్టింది. అందులో 7 సీట్లను ఏకంగా రెడ్డి సామాజిక వర్గానికి కేటాయించింది. రాష్ట్ర జనాభాలో సగాని కంటే ఎక్కువగా దాదాపు 55 నుంచి 60 శాతం బీసీ జనాభా ఉండగా, ఈ వర్గాలను కాంగ్రెస్ పూర్తిగా విస్మరించింది. మొక్కుబడిగా 3 సీట్లు కేటాయించి చేతులు దులుపుకున్నది. బీసీ జనాభాలో అత్యధికంగా ఉన్న యాదవ, గౌడ సామాజిక వర్గాన్ని పూర్తిగా విస్మరించింది. ఎస్సీలలో అత్యధికంగా 70 లక్షల మంది మాదిగల జనాభా ఉండగా, ఎస్సీలకు రిజర్వు చేసిన 3 సీట్లలో మాదిగలకు ఒకే ఒక సీటు (కడియం కావ్య-వరంగల్) కేటాయించి, తక్కువ జనాభా కలిగిన మాల సామాజిక వర్గానికి మాత్రం 2 సీట్లు (మల్లు రవి-నాగర్‌కర్నూల్), (వంశీకృష్ణ-పెద్దపల్లి) కేటాయించింది. ఉమ్మడి నిజామాబాద్, ఖమ్మం, రంగారెడ్డి జిల్లాల్లో కమ్మ సామాజిక వర్గం గెలుపోటములను ప్రభావితం చేసే స్థాయిలో ఉన్నప్పటికీ వారికి ఒక్క సీటు కూడా కేటాయించలేదు. ఇది ఆ సామాజికవర్గాన్ని తీవ్ర అసంతృప్తికి గురిచేసింది.

బీఆర్ఎస్‌లో బీసీలకు పెద్ద పీట

ప్రధాన ప్రతిపక్షం బీఆర్ఎస్ పార్టీ ఎంపీ అభ్యర్థుల ఎంపికలో అణగారిన వర్గాలకు అగ్రతాంబూలం ఇచ్చింది. 12 జనరల్ స్థానాల్లో ఆరింటిని బీసీలకు కేటాయించింది. బీసీలలోనూ కులాల వారీగా సమతూకం పాటించింది. కాంగ్రెస్ యాదవ, గౌడ సామాజిక వర్గాలను విస్మరించింది. బీఆర్ఎస్ మాత్రం గౌడ సామాజికవర్గం నుంచి తిగుళ్ల పద్మారావు (సికింద్రాబాద్), యాదవ సామాజికవర్గం నుంచి గడ్డం శ్రీనివాస్‌యాదవ్ (హైదరాబాద్), క్యామ మల్లేశ్ (భువనగిరి)కు టికెట్లు కేటాయించింది. మాదిగల జనాభా ఎక్కువగా ఉండడంతో 3 రిజర్వుడు స్థానాల్లో రెండు సీట్లను సుధీర్‌కుమార్ (వరంగల్), ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్ (నాగర్‌కర్నూల్) కేటాయించింది. కొప్పుల ఈశ్వర్‌కు పెద్దపల్లి కేటాయించింది. రెడ్డి సామాజికవర్గానికి కాంగ్రెస్ ఏడు సీట్లు కేటాయించగా, బీఆర్ఎస్ మాత్రం నాలుగు సీట్లు మాత్రమే కేటాయించింది. కమ్మ సామాజికవర్గానికి ప్రాధాన్యం ఇస్తూ ఖమ్మం స్థానాన్ని నామా నాగేశ్వరరావుకు ఇచ్చింది.

కాంగ్రెస్‌లో సీట్ల కేటాయింపు	బీఆర్ఎస్ అభ్యర్థుల ఎంపికలో బీసీలకు పెద్దపీట
రెడ్డి సామాజికవర్గం	**బీసీలు**
నిజామాబాద్-టీ జీవన్‌రెడ్డి	నిజామాబాద్-బాజిరెడ్డి గోవర్ధన్ (బీసీ-మున్నూరు కాపు)
మల్కాజిగిరి-సునీతామహేందర్‌రెడ్డి	జహీరాబాద్-గాలి అనిల్‌కుమార్ (బీసీ-మున్నూరు కాపు)
చేవేళ్ల-గడ్డం రంజిత్‌రెడ్డి	చేవేళ్ల-కాసాని జ్ఞానేశ్వర్ (బీసీ-ముదిరాజ్)
మహబూబ్‌నగర్-చల్లా వంశీచంద్‌రెడ్డి	సికింద్రాబాద్-టీ పద్మారావు (బీసీ-గౌడ్)
నల్లగొండ-కే రఘువీర్‌రెడ్డి	హైదరాబాద్-గడ్డం శ్రీనివాస్‌యాదవ్ (బీసీ-యాదవ)
భువనగిరి-చామల కిరణ్‌కుమార్‌రెడ్డి	భువనగిరి-క్యామ మల్లేశ్ (బీసీ-యాదవ)
ఖమ్మం-రామసహాయం రఘురాంరెడ్డి	**రెడ్డి**
బీసీలు	మెదక్- పీవెంకట్రామిరెడ్డి
సికింద్రాబాద్-దానం నాగేందర్ (మున్నూరు కాపు)	మల్కాజిగిరి-రాగిడి లక్ష్మారెడ్డి
మెదక్-నీలం మధు (ముదిరాజ్),	మహబూబ్‌నగర్-మన్నె శ్రీనివాస్‌రెడ్డి
జహీరాబాద్-సురేశ్ షెట్కార్ (లింగాయత్)	నల్లగొండ-కంచర్ల కృష్ణారెడ్డి
ఎస్సీ	**ఎస్సీ**
పెద్దపల్లి-వంశీకృష్ణ (మాల)	పెద్దపల్లి-కొప్పుల ఈశ్వర్ (ఎస్సీ మాల)
నాగర్‌కర్నూల్-మల్లురవి(మాల)	వరంగల్-ఎం సుధీర్‌కుమార్ (ఎస్సీ-మాదిగ)
వరంగల్-కడియం కావ్య (మాదిగ)	నాగర్‌కర్నూలు-ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్ (ఎస్సీ-మాదిగ)
ఎస్టీ	**ఎస్టీలు**
మహబూబాబాద్-బల్‌రామ్ నాయక్(లంబాడీ)	ఆదిలాబాద్-ఆత్రం సక్కు (ఆదివాసీ)
ఆదిలాబాద్-ఆత్రం సుగుణ (ఆదివాసీ)	మహబూబాబాద్-మాలోతు కవిత (ఎస్టీ-లంబాడీ)
మైనార్టీ	**ఇతరులు**
హైదరాబాద్-సమీర్ వలీ ఉల్లా (మైనార్టీ)	కరీంనగర్-బీ వినోద్‌కుమార్ (వెలమ)
వెలమ	ఖమ్మం-నామా నాగేశ్వర్‌రావు (కమ్మ)
కరీంనగర్-వెలిచాల రాజేందర్‌రావు (వెలమ)	

టీఐఎఫ్ఆర్‌లో ఉన్నత విద్యావకాశాలు

- కెమిస్ట్రీ, ఫిజిక్స్‌లో ఇంటిగ్రేటెడ్ పీహెచ్‌డీకి నోటిఫికేషన్

హైదరాబాద్ సిటీబ్యూరో, ఏప్రిల్ 25(నమస్తే తెలంగాణ) : టాటా ఇనిస్టిట్యూట్ ఆఫ్ ఫండమెంటల్ రీసెర్చ్ హైదరాబాద్‌లో కెమిస్ట్రీ, ఫిజిక్స్‌లో ఎమ్మెస్సీ, పీహెచ్‌డీకి నోటిఫికేషన్ జారీ చేసింది. బీఎస్సీ చదివిన వారు సింథటిక్ కెమిస్ట్రీ, కెమికల్ బయాలజీ, బయోఫిజికల్ కెమిస్ట్రీ, సర్ఫేస్ అండ్ ఇంటర్‌ఫేషియల్ కెమిస్ట్రీ, థిరీటికల్ అండ్ కంప్యూటేషనల్ కెమిస్ట్రీ తోపాటు, బయోఫిజిక్స్, లేజర్ ఫిజిక్స్, ఫొటోనిక్స్, సాఫ్ట్ అండ్ యాక్టివ్ మ్యాటర్, మెటీరియల్ ఫిజిక్స్ వంటి అంశాల్లో పీహెచ్‌డీ పూర్తి చేసే అవకాశం ఉందన్నారు. ఫిజిక్స్‌లో పీహెచ్‌డీ దరఖాస్తుకు ఆఖరు తేదీ ఈ నెల 30 కాగా, మే 10 లోపు కెమిస్ట్రీలో దరఖాస్తు చేసుకునే వీలుంది.

30న జహీరాబాద్‌లో మోదీ రోడ్‌షో

హైదరాబాద్, ఏప్రిల్ 25 (నమస్తే తెలంగాణ): ప్రధాని మోదీ ఈనెల 30న సాయంత్రం జహీరాబాద్ పార్లమెంట్ నియోజకవర్గంలో రోడ్ షో నిర్వహించనున్నారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా ఈనెల 27 నుంచి 30 వరకు మహారాష్ట్ర, గోవా, కర్ణాటక, తెలంగాణలో ప్రధాని పర్యటించనున్నట్టు పార్టీ వర్గాలు తెలిపాయి. తిరిగి మే 2,3 తేదీల్లో ఏపీ పర్యటనకు వస్తారని, ఈ సందర్భంగా మరోసారి తెలంగాణలో పర్యటించే అవకాశం ఉన్నదని వెల్లడించాయి.



దిలావర్‌పూర్‌లో ప్రొఫెసర్ కోదండరాంను నిలబీస్తున్న మహిళా రైతులు

కోదండరాంపై అన్నదాతల ఆగ్రహం

- మాపై కేసులున్నప్పడేమయ్యారు
- ఇప్పడెందుకొచ్చారంటూ నిలదీత

నిర్మల్, ఏప్రిల్ 25 (నమస్తే తెలంగాణ) : నిర్మల్ జిల్లా దిలావర్‌పూర్ మండల కేంద్రంలో గురువారం టీజేఏసీ చైర్మన్ ప్రొఫెసర్ కోదండరాంకు నిరసన సెగ తగిలింది. మండల కేంద్రంలో నిర్మించ తలపెట్టిన ఇథనాల్ పరిశ్రమ పనులను కొనసాగించకుండా చర్యలు తీసుకుంటామంటూ గ్రామస్థులతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఇంతలోనే పలువురు ముందుకు వచ్చి తాము ఇప్పుడు గుర్తుకు వచ్చామా? అంటూ నిలదీశారు. అక్రమ కేసులు నమోదు చేసినప్పుడు తమకు ఎవరూ అండగా నిలువలేదని, ఇప్పుడు ఎన్నికలు వచ్చాయని తమ వద్దకు మళ్లీ వచ్చారా? అంటూ ప్రశ్నించారు. దీనికి స్పందించిన ఆయన తాను ఏ పార్టీకి చెందిన వ్యక్తిని కాదని, కేవలం ఇథనాల్ పరిశ్రమను అడ్డుకునేందుకు జరుగుతున్న పోరాటంలో సంఘీభావం తెలిపేందుకే వచ్చానని చెప్పుకొచ్చారు. ఇక్కడి రైతులపై పెట్టిన కేసులను ఎత్తేసే వరకు టీజేఏసీ పోరాటం చేస్తుందని హామీ ఇచ్చారు.

'మంత్రి సీతక్కను బర్తరఫ్ చేయాలి'

- మావోయిస్టులకు మద్దతిచ్చేలా ఆమె కార్యకలాపాలు
- గవర్నర్, రాష్ట్రపతికి లేఖ రాసిన యాంటి టెర్రరిజం ఫోరం

సిటీబ్యూరో, ఏప్రిల్ 25 (నమస్తే తెలంగాణ) : మావోయిస్టులకు మద్దతునిచ్చేలా కార్యకలాపాలు సాగిస్తున్న మంత్రి సీతక్కను బర్తరఫ్ చేయాలని గవర్నర్‌కు ఫిర్యాదు చేసినట్టు యాంటి టెర్రరిజం ఫోరం చైర్మన్ డాక్టర్ రావినూతల శశిధర్ గురువారం తెలిపారు. ఇటీవల ఛత్తీస్‌గఢ్‌లోని కాంకేర్‌లో జరిగిన పోలీసు ఎదురుకాల్పుల్లో మృతి చెందిన మావోయిస్టు నాయకుడు సుధాకర్ అలియాస్ శంకరన్న గ్రామానికి మంత్రి వెళ్లి మావోయిస్టులకు నివాళులర్పించారని ఆరోపించారు. మాజీ నక్సలైట్ , పోలీసులకు లొంగిపోయి ఎమ్మెల్యేగా ఎన్నికైన సీతక్క ప్రస్తుతం మంత్రి పదవిలో ఉండి ప్రభుత్వ రహస్యాలు మావోయిస్టులకు చేర్చే అవకాశం ఉందన్నారు. కేంద్ర హోంశాఖ, రాష్ట్రపతికి కూడా మంత్రి సీతక్క వ్యవహారశైలిపై లేఖలు రాసినట్టు వివరించారు.

బిల్లుల కోసం పడిగాపులు

- సచివాలయం చుట్టూ ప్రదక్షిణలు
- నెలాఖరు కావడంతో పెరుగుతున్న అర్జీలు

హైదరాబాద్, ఏప్రిల్ 25 (నమస్తే తెలంగాణ) : రాష్ట్ర ఆర్థిక శాఖలో పెండింగ్‌లో ఉన్న తమ బిల్లులను వెంటనే చెల్లించాలని ఆ శాఖ అధికారుల చుట్టూ రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగ, ఉపాధ్యాయులు ప్రదక్షిణలు చేస్తున్నారు. ముఖ్యంగా నెలాఖరు కావడంతో ఆర్థిక శాఖ అధికారులకు బిల్లుకు సంబంధించిన టోకెన్ నంబర్లు సహా అర్జీలు దాఖలు చేస్తున్నారు. మూడు నెలల నుంచి తిరుగుతున్నా చిన్న చిన్న మెడికల్ బిల్లులు కూడా చెల్లించడంలేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. టోకెన్ నంబర్లతో దరఖాస్తులు చేసుకుంటున్న వారిలో ఎవరికి క్లియర్ అవుతున్నాయో కూడా అర్థం కావడంలేదంటున్నారు. బాధితుల్లో ఎక్కువగా ఉపాధ్యాయులే. ఓ వైపు ఎండలు.. మరో వైపు ఎన్నికల కోడ్.. అయినా బిల్లుల కోసం బాధిత వర్గాలు నిత్యం వందల సంఖ్యలో సచివాలయానికి వస్తున్నారు. ఆర్థిక శాఖ వద్ద ఉన్న పెండింగ్ బిల్లులు ఇప్పటికే ట్రెజరీలతో పాటు ఆయా డిపార్టుమెంట్ల నుంచి కూడా క్లియర్ చేయడం లేదని ఉద్యోగ, ఉపాధ్యాయులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఈ అంశంపై ముఖ్యమంత్రి, డిప్యూటీ సీఎం, ఇతర శాఖ మంత్రులు స్పందించి తమకు న్యాయం చేయాలని కోరుతున్నారు.

ఎమ్మెల్యే యశస్వినికి నిరసన సెగ

- కష్టపడ్డా గుర్తింపు ఇస్తలేరు
- కొత్తగా వారిని పిలుస్తున్నరు
- రాయపర్తిలో కార్యకర్త ఫైర్



రాయపర్తి, ఏప్రిల్ 25: కాంగ్రెస్‌లో కష్టపడి పనిచేసిన వారికి కాకుండా, కొత్తగా వచ్చిన వారికి ప్రాధాన్యత ఇస్తున్నారని పాలకుర్తి నియోజకవర్గం రాయపర్తి మండలానికి చెందిన పార్టీ కార్యకర్త షాజహాన్ స్థానిక ఎమ్మెల్యే మామిడాల యశస్వినీరెడ్డిని నిలదీశారు. మోసం చేస్తున్న వారిని పక్కన పెట్టుకుంటున్నారని, మొదటి నుంచి ఉన్న వారిని దూరం పెడుతున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. వరంగల్ జిల్లా రాయపర్తి మండల కేంద్రంలో గురువారం జరిగిన పార్టీ ముఖ్య కార్యకర్తల సమావేశంలో ఎమ్మెల్యే యశస్వినీరెడ్డి ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. తమ కుటుంబానికి చెందిన రూ.1.20 కోట్ల భూమి పోయిందని, అయినా పార్టీని పట్టుకుని ఉంటున్నామని, అయినా గుర్తింపు ఇవ్వడం లేదని షాజహాన్ ఆవేదన వ్యక్తం చేశారు. మోసం చేసి భూమి కొన్న వ్యక్తికి పార్టీలో ప్రాధాన్యత ఇస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. పూర్వీకుల నుంచి వచ్చిన తమ భూమిని మోసం చేసిన వారిని దూరం పెట్టాలని వేడుకొన్నారు. కొత్తగా పార్టీలో చేరిన వనజా రాణికి ఎందుకు ప్రాధాన్యత ఇస్తున్నారని ప్రశ్నించారు. మొదటి నుంచి